సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 21 । నవంబర్ । 2023


మార్మోగిన శివ నామస్మరణ
కార్తీక మాసం తొలి సోమవారం పురస్కరించుకుని జిల్లాలోని శివాలయాల్లో శివ నామస్మరణ మార్మోగింది. 8లో


ఘనంగా కుంతీదేవి ఉత్సవాలు
వీఆర్‌పురం మండలం రేఖపల్లిలో మూడేళ్లకొకసారి నిర్వహించే కుంతీదేవి ఉత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. 8లో


కమనీయం.. కల్యాణం
సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామివారి నిత్య కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది.

న్యూస్‌రీల్

వైద్యుల పోస్టుల భర్తీకి చర్యలు

వైద్య విధాన పరిషత్ జిల్లా సమన్వయకర్త కృష్ణారావు


సీహెచ్‌సీలో వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ కృష్ణారావు

కూనవరం: మండలంలోని కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో ప్రసూతి వైద్య నిపుణుడు, దంత వైద్యుల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య విధాన పరిషత్ సమన్వయకర్త కృష్ణారావు తెలిపారు. సోమవారం ఆయన ఈ సీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూనవరం సీహెచ్‌సీకి రెగ్యులర్ జనరల్ సర్జన్, చర్మవ్యాధి నిపుణుడితోపాటు ముగ్గురు రెగ్యలర్ వైద్యాధికారులను నియమించామన్నారు. మిగతా వైద్యనిపుణుల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే ఇక్కడ జనరల్ సర్జరీలు ప్రారంభించాలని సూపరింటెండెంట్ డాక్టర్ టీవీ శేషిరెడ్డి, జనరల్ సర్జన్ డాక్టర్ మహేష్ బాబును ఆయన ఆదేశించారు. ఎన్‌ఆర్‌సీ కేంద్రంలో పోషకాహారలోపం ఉన్న పిల్లలను గుర్తించి మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. సిబ్బంది నివాసం ఉండేందుకు అవసరమైన పాత ప్రైవేట్ క్వార్టర్లను ఆయన పరిశీలించారు. వైద్యులు తేజ, సంతోష్ ,అర్బాజ్ ఖాన్, హెడ్ నర్స్ బి. బొజ్జి , డీసీహెచ్ ఎస్ పాడేరు సీనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

పెరుగుతున్న చలి తీవ్రత


ముంచంగిపుట్టులో దట్టంగా కురుస్తున్న మంచులో రాకపోకలు

ముంచంగిపుట్టు: మండలంలో రోజురోజుకు చలి తీవ్రత పెరుగుతోంది. రోజువారీ పనులకు వెళ్లే కూలీలు,ఉద్యోగులు,ఉపాధ్యాయులు,వ్యాపారులు వణికిపోతున్నారు.సాయంత్రం 4 గంటల నుంచి చలి మొదలు ఉదయం 10 గంటల వరకు చలితీవ్రత అధికంగా ఉంటుంది. చలి మంటలు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు.

సామాజిక సాధికార బస్సు యాత్ర వాయిదా

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్గుణ, వైఎస్సార్‌సీపీ నేతలు

అరకులోయ టౌన్: హుకుంపేట మండలంలో ఈనెల 30 వతేదీన నిర్వహించ తలపెట్టిన అరకు అసెంబ్లీ నియోజకవర్గ సామాజిక సాధికార బస్సు యాత్ర వాయిదా పడినట్టు స్థానిక ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో బస్సు యాత్ర నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందన్నారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది తేదీ ఖరారు చేసి ప్రకటిస్తామన్నారు. అదేవిధంగా సాధికార బస్సు యాత్ర విజయవంతానికి సంబంధించి ఈ నెల 21వ తేదీ మంగళవారం అరకులోయలో పార్టీ శ్రేణులతో నిర్వహించాల్సిన సన్నాహక సమావేశం కూడ వాయిదా వేసినట్లు ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ముఖ్య నాయకులు ఈ విషయాన్ని గమనించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సమావేశంలో వైస ఎంపీపీ రామన్న, బస్కీ సర్పంచ్ రమేష్, ముఖ్య నాయకులు శెట్టి అప్పాలు, వెంకటరావు, ముఖీ సాంబ తదితరులు పాల్గొన్నారు.

పంట చేతికందే వేళ.. కలవరం


హుకుంపేట మండలం ములుశోభ ప్రాంతంలో పొలంలో ఆరబెట్టిన వరిపనలు

ఆరుగాలం కష్టపడి పండించారు. కొద్ది రోజుల్లో ఫలసాయం చేతికందనున్న నేపథ్యంలో వాతావరణశాఖ హెచ్చరికలు గిరి రైతుల గుండెల్లో గుబులు రేపుతున్నాయి. అల్పపీడనం కారణంగా నెలకొన్న మబ్బులు కలవరపెడుతున్నాయి.

- గిరి రైతుల్లో గుబులు రేపుతున్న వాతావరణ మార్పులు
- అల్పపీడనం హెచ్చరికలతో ఆందోళన

సాక్షి,పాడేరు: అల్పపీడనం హెచ్చరికలు జిల్లాలో రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. సోమవారం ఉదయం నుంచి ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. మబ్బులు కమ్మేయడంతో పాటు కొన్ని చోట్ల కురిసిన వాన జల్లులు రైతుల్లో గుబులు పుట్టించాయి. జిల్లాలో 50, 430 హెక్టార్లలో వరి సాగు చేపట్టారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో పైరు పక్వానికి చేరుకుంది. కొద్దిరోజులుగా పగటి ఉష్ణోగ్రతలు ఆశాజనకంగా ఉన్నందున వరి కోతలు చేపట్టి, పనలను పొలంలో ఆరబెట్టారు. ఇంతలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటుచేసుకుంది.


పాడేరు ప్రాంతంలో కమ్మిన కారుమబ్బులు


వరి కుప్పకు కప్పిన టార్పాలిన్

వరి పనలు సురక్షిత ప్రాంతాలకు..

వర్షాలు కురిసే పరిస్థితి ఉందని భావిస్తున్న గిరిజన రైతులు కోతకోసిన పంటను కాపాడుకునే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. కోసిన వరిపనలను సురక్షిత ప్రాంతాలకు తరలించి కుప్పలు పెట్టడంతో పాటు వాటిపై ప్లాస్టిక్ కవర్లు, టార్పాలిన్లు కప్పే పనిలో నిమగ్నమయ్యారు. మిగతా రైతులు వరి కోతలను నిలిపివేశారు. ఒక వేళ వర్షం కురిస్తే వరి పొలంలో నీరు నిల్వ లేకుండా ఉండేలా పల్లపు ప్రాంతాలకు పోయేలా కాల్వలను ఏర్పాటుచేస్తున్నారు. పంటను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆర్‌బీకే కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



వాతావరణ మార్పులపై గిరిజన రైతులు అప్రమత్తంగా ఉండాలి. పంట కోతలకు తాత్కాలిక విరామం ప్రకటించడంతో పాటు కోసిన వరిపనలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి .కుప్పలు తడిచిపోకుండా టార్పాలిన్లు కప్పాలి. వర్షాలకు వరిపనలు తడిచిన సందర్భంలో లీరు నీటిలో 5శాతం ఉప్పును కలిపి పిచికారీ చేస్తే ధాన్యం రంగు మారకుండా కాపాడకోవచ్చు. యంత్రాలు సిద్ధంగా ఉంటే వాతావరణ పరిస్థితుల అనుకూలతను బట్టి నూర్పులు చేపట్టాలి.

– ఎస్‌బీఎస్ నందు,
జిల్లా వ్యవసాయాధికారి, పాడేరు

చిన్నారి సజీవ దహనం


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మత్స్యరాస విశ్వేశ్వరరాజు


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య

- మరిగిన నూనె పొయ్యిలో పడటంతో ప్రమాదం
- చలిమంట కాగుతున్న చిన్నారికి వ్యాపించిన మంటలు
- అక్కడికక్కడే మృతి


నిత్య (ఫైల్)

చింతపల్లి రూరల్: మండలంలోని అన్నవరంలో జరిగిన అగ్ని ప్రమాదంలో చిన్నారి సజీవ దహనమైంది. సోమవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి అన్నవరం ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇదే గ్రామానికి చెందిన గెమ్మెలి రాజేష్, కావ్య దంపతులు తిను బండారాలు తయారు చేసి వారపు సంతలో విక్రయించి జీవనం సాగిస్తున్నారు. సోమవారం వారపు సంత కావడంతో ఉదయం ఏడు గంటల సమయంలో ఇంటివద్ద పిండి వంటలు తయారు చేసుకునే క్రమంలో కట్టెల పొయ్యిపై పెనంలో మరుగుతున్న నూనె మంటల్లో పడటంతో ఒక్కసారిగా ఎగిశాయి. అక్కడే చలిమంట కాగుతున్న వారి కుమార్తె నిత్య (7)పై నూనె పడటంతో ఆమెకు మంటలు వ్యాపించి కమ్మేశాయి. పరిస్థితి చేయి దాటిపోవడంతో మంటలను అదుపు చేయలేకపోయారు. పూర్తిగా కాలిపోవడంతో చిన్నారి నిత్య అక్కడికక్కడే చనిపోయింది. దుకాణం పూర్తిగా కాలిపోయింది. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్టీ కమిషన్ సభ్యులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు సంఘటన స్థలానికి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేలు అందజేశారు. ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, మండల పార్టీ అధ్యక్షుడు పరామర్శించారు. బియ్యం, రగ్గులు అందజేసినట్టు డీటీ రాజ్‌కుమార్ తెలిపారు. నిత్య అన్నవరం పాఠశాలలో రెండవ తరగతి చదువుతోంది.


బియ్యం, నిత్యావసర సరకులు అందజేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ రాజ్‌కుమార్

తుపాకీ వదిలి అభివృద్ధికి చేయి కలపండి


ట్యాంకును ప్రారంభిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ

- ఎస్పీ తుహిన్ సిన్హా
- గౌరిలోవలో మంచి నీటి ట్యాంక్ ప్రారంభం

సీలేరు: మావోయిస్టులు తుపాకీని వదిలి జనజీవన స్రవంతిలో కలిసి గిరిజన గ్రామాల అభివృద్ధికి చేయి కలపాలని ఎస్పీ తుహిన్ సిన్హా పిలుపునిచ్చారు. దుప్పులవాడ పంచాయతీ మారుమూల ప్రాంతమైన గౌరిలోవలో పోలీసుల సహకారంతో రూ.10 లక్షలతో నిర్మించిన మంచినీటి వాటర్ ట్యాంకును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిజనులను ఉద్దేశించి మాట్లాడారు. దశాబ్దాల కాలంగా ఈ ప్రాంతంలో మావోయిస్టులు సంచరించడం వల్ల గ్రామాలు అభివృద్ధి చెందలేదన్నారు. ప్రస్తుతం వారి కదలికలు తగ్గడంతో గ్రామాలభివృద్ధి చెందుతున్నాయని, అందుకు పోలీసుశాఖ ఎప్పుడూ అండగానే ఉంటుందని అన్నారు. మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.ఇప్పటికే పోలీసుశాఖ ద్వారా గిరిజన గ్రామాల్లో రోడ్లు, మంచినీటి ట్యాంకులు, సదరం క్యాంపులు, బస్ పాసులు, ప్రేరణ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మారుమూల ప్రాంతాల్లో సైతం మరింత అభివృద్ధి జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

గిరిజన నిరుద్యోగులకు అండగా..

ఏజెన్సీ మారుమూల ప్రాంతాల్లో గిరిజన యువతీ యువకులకు పోలీసు శాఖ నిరంతరం అండగా ఉంటుందని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. వివిధ ప్రాంతాల్లో ఇప్పటికే పోలీసు శాఖ ద్వారా ఉద్యోగాలు పొందారన్నారు. బెంగళూరులో ఐఫోన్ తయారీ కంపెనీల్లో గిరిజన యువత ఉన్నారన్నారు. ప్రస్తుతం గిరిజన నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకు అవసరమైన సహకారాన్ని బ్యాంకుల ద్వారా కల్పిస్తున్నామని చెప్పారు. మావోయిస్టుల వైపు, గంజాయి వైపు మళ్లకుండా ఉండేలా గంజాయి రహిత జిల్లాగా ఈ ప్రాంతాన్ని తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టామని, ఇందుకు మీ సహకారం కూడా అవసరమని కోరారు. మావోయిస్టు పార్టీల్లో ప్రస్తుతం ఉన్న కాకూరు పండన్న జనజీవన స్రవంతిలో కలవాలని కోరుతూ అతని వదినను కలిసి కొంత నగదు ప్రోత్సాహకంగా అందజేశారు. ఏజెన్సీలోని సమాచార వ్యవస్థ బలోపేతానికి పెద్ద ఎత్తున సెల్‌టవర్ల నిర్మాణానికి పోలీస్‌శాఖ కృషిచేస్తోందన్నారు. అనంతరం గిరిజన క్రీడకారులకు వాలీబాల్ పోటీలు నిర్వహించి, వెయ్యి మందికి భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి అదనపు ఎస్పీ ప్రశాంత్‌శివ కిషోర్, సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐలు రామకృష్ణ, అప్పలసూరి, సర్పంచ్ కుమారి పాల్గొన్నారు.

వసతుల కల్పనలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే హెచ్చరిక
- విద్యార్థినుల ఫిర్యాదుపై స్పందన
- గురుకులానికి బాలికలతో కలిసి బస్సులో వెళ్లిన పీవో
- ప్రిన్సిపాల్‌ను బాధ్యతల నుంచి తొలగింపు


రంపచోడవరం గురుకుల పాఠశాలలో బాలికలతో మాట్లాడుతున్న పీవో సూరజ్ గనోరే


విద్యార్థినులతో బస్సులో వెళ్తున్న ఐటీడీఏ పీవో

రంపచోడవరం: ప్రభుత్వ గురుకులాలు, గిరిజన ఆశ్రమాలు, కస్తూర్బా విద్యాలయాల్లో విద్యార్థులకు వసతుల కల్పనలో నిర్లక్ష్యం చేస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే హెచ్చరించారు. మౌలిక సదుపాయాలు, తాగునీరు, తరగతి గదిలో లైట్లు, ఫ్యాన్లు సరిగ్గా పనిచేయక ఇబ్బందులు పడుతున్నామని స్థానిక గిరిజన గురుకుల బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థినులు సోమవారం ఐటీడీఏ కార్యాలయానికి వెళ్లి ఆయనకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన పీవో వారితో కలిసి ప్రైవేట్ బస్సులో అక్కడి నుంచి గురుకుల బాలికల పాఠశాలకు వెళ్లారు. విద్యార్థినులకు తాగునీరందించే ఆర్వో ప్లాంట్, వాటర్ ట్యాంక్‌ను ఆయన పరిశీలించారు. మౌలిక వసతుల కల్పనలో లోపాలను గుర్తించిన ఆయన ప్రిన్సిపాల్‌ను బాధ్యతలనుంచి తప్పించి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు అప్పగించారు. వెంటనే మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారవర్గాలను పీవో ఆదేశించారు. విద్యార్థినుల ఫిర్యాదుపై విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. సీడీపీవో సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

సారా కేసులో వ్యక్తి అరెస్టు

కొయ్యూరు: రాజేంద్రపాలెం పంచాయతీ సూరేంద్రపాలెంకు చెందిన ఈరోజు నూకాజును సోమవారం పది లీటర్ల సారాతో పట్టుకుని అరెస్ట్ చేశామని ఎస్‌ఐ రాజారావు తెలిపారు. రెండు రోజుల క్రితం సూరేంద్రపాలెంలో 1200 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామన్నారు. దీనిలో భాగంగా సారా తయారీదారులను గుర్తిస్తున్నామన్నారు. ఆపరేషన్ పరివర్తన్‌లో భాగంగా సారాపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.అదే విధంగా తయాదీదారులు, విక్రయదారులపై చర్యలు తీసుకుంటున్నామని ఆయన వెల్లడించారు.

ఐటీడీఏ స్పందనలో 71 వినతుల స్వీకరణ

- సత్వర పరిష్కారానికి చర్యలు
- రంపచోడవరం పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్


వినతులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్‌కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందనలో 71 వినతులు సేకరించినట్టు పీవో సూరజ్ గనోనే, సబ్ కలెక్టర్ శుభం భన్సల్ తెలిపారు. వృద్ధాప్య పింఛను, రేషన్ మంజూరు చేయాలని వై.రామవరం మండలం అంటిలోవ గ్రామానికి చెందిన పల్లాల లక్ష్మమ్మ వినతి అందజేసింది. పాలగడ్డ గ్రామం నుంచి గొర్రలోడు వరకు సుమారు ఏడు కిలోమీటర్ల రహదారికి మరమ్మతులు చేపట్టాలని సారం కోట అబ్బాయి రెడ్డి అధికారులను కోరారు. రంపచోడవరం మండలం ఐ.పోలవరంలో 400 ఎకరాలకు సాగునీరు అందించే ఎత్తిపోతల పథకానికి సంబంధించిన మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు సరిగ్గా పనిచేయడం లేదని వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటుచేయాలని బంధం పోతున్నదొర, కంగల సూర్యారావు, కంగల కన్నయ్య దొర కోరారు. వై.రామవరంలో సర్వేనెంబర్ 71/1లో భూసమస్య పరిష్కరించాలని కోటం లక్ష్మయ్య, ముర్ల సూరిబాబు దరఖాస్తు అందజేశారు. వై. రామవరం మండలం చింతలపూడి పంచాయతీలోని రైతులకు సాగునీరు అందించే కస్నీరు వాగులో పూడికతీతకు చర్యలు తీసుకోవాలని, బొడ్డగుంట, చింతకొయ్య గ్రామాల మధ్యలో కాలువపై బ్రిడ్జి నిర్మించాలని చింతలపూడి ఉపసర్పంచ్ పల్లాల లచ్చిరెడ్డి, కత్తుల ఆది రెడ్డి అధికారులను కోరారు. వీటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డీఎస్ శాస్త్రి, డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవన్, ఏడీఎంహెచ్‌వో జి. ప్రకాశం, ఏపీడీ వెలుగు ఎ. శ్రీనివాసరావు, పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి. డేవిడ్ రాజ్, ఎండీ యూసఫ్, సుబ్బయ్య, పీఏవో రాంబాబు, పీహెచ్‌వో చిట్టిబాబు, డాక్టర్ ఇందిర, సీడీపీవో సంధ్యారాణి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సాయి సతీష్, రాజేంద్రబాబు, శ్రీరామచంద్రమూర్తి, ఏపీ ఈపీడీసీఎల్ డీఈ మల్లికార్జునరావు, ఎంఈవో సి. శ్రీహరి, పశుసంవర్ధక వైద్యాధికారి గోపిక, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్ బి. కిషోర్, లీగల్‌సెల్ న్యాయవాది సత్యనారాయణ పాల్గొన్నారు.

మళ్లీ సీఎంగా జగనే కావాలి.. రావాలి

- పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి
- నడింపాలెంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం


నడింపాలెంలో సంక్షేమ పథకాల బోర్డు వద్ద పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, పార్టీ నేతలు


కొండగోకిరిలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

కొయ్యూరు: మళ్లీ సీఎంగా జగన్ రావాల్సిన అవసరం రాష్ట్రానికి ఎంతైనా ఉందని పాడేరు ఎమ్మెల్యే కె భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం ఆమె నడింపాలెం గ్రామసచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడి సచివాలయం పరిధిలో రూ.15కోట్లతో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి వివరాలతో కూడిన బోర్డును ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 32 సంక్షేమ పథకాల రూపంలో ఇప్పటి వరకు ఆర్థికసాయం అందించామన్నారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాల కాలంలో నడిపాలెం పరిధిలో సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం రూ.15 కోట్లు వెచ్చించదన్నారు. జగనన్నతోనే పేదలకు మేలు జరుగుతుందన్నారు.

సేవలు పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు

ప్రజలకు సేవలందించడంలో ఫిర్యాదు వస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి హెచ్చరించారు. సోమవారం ఆమె కొండగోకిరి గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్నిచోట్ల సచివాలయ సిబ్బందితో పాటు అధికారులపై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వాటిని సరిదిద్దుకోవాలని సూచించారు.లేకుంటే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవలసి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటి వరకు కొయ్యూరు మండలంలో 23 సచివాలయాల్లో 14 చోట్ల కొత్త భవనాలను ప్రారంభించామన్నారు. మిగిలిన వాటిని త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, కొండగోకిరి సర్పంచ్ రేగటి ముసిలినాయుడు, వైస్ ఎంపీపీలు అప్పన వెంకటరమణ, అంబటి నూకాలు, సర్పంచ్‌లు శ్రీను, జంపా రాజకుమారి, పాటి నూకత్నం , జంపా కన్నయమ్మ, చింతపల్లి ఏఎంసీ చైర్మన్ జె రాజులమ్మ, డైరెక్టర్ అచ్యుత్, పీఏసీఎస్ అధ్యక్షుడు సూరిబాబు, ట్రైకార్ డైరెక్టర్ సుమర్ల సరస్వతి, చింతపల్లి ఏఎంసీ చైర్మన్ రాజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'వికసిత్' సంకల్పయాత్ర సభ

- వంట్లమామిడిలో ఏర్పాట్లు పూర్తి
- పరిశీలించిన పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్
- పాల్గొంటున్న పీఎం అదనపు కార్యదర్శి అతీష్‌చంద్ర


వంట్లమామిడిలో ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి,పాడేరు: జిల్లాలోని వంట్లమామిడిలో ఈనెల 21 మంగళవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దీనిలో భాగంగా పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ సోమవారం వంట్లమామిడి గ్రామాన్ని సందర్శించి సభా ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమం సందర్భంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలుజేస్తున్న సంక్షేమ,అభివృద్ధి పథకాలపై ఛాయాచిత్ర ప్రదర్శనతో పాటు, జీసీసీ, డీఆర్‌డీఏ, వైద్య ఆరోగ్యశాఖలకు చెందిన స్టాళ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పీఎం నరేంద్రమోది అదనపు కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి అతీష్‌చంద్ర మంగళవారం పాడేరు విచ్చేస్తున్నారు. వంట్లమామిడిలో జరిగే బహిరంగ సభలో ఆయన పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన కార్యక్రమాలను గిరిజనులకు వివరిస్తారని ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవోలు వి.ఎస్.ప్రభాకర్, ఎం.వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమశాఖ ఈఈ డీవీఆర్‌ఎం రాజు,డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, ఎంపీడీవో సాయినవీన్, ఐటీడీఏ ఏఏవో శ్రీనివాసకుమార్, ఏఈ దేముళ్లు, ట్రైకార్ సంస్థ అధికారి సీతారామయ్య పాల్గొన్నారు.

పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ మధుసూదనరెడ్డి


కాటేజీలను ప్రారంభిస్తున్న మధుసూదనరెడ్డి

మారేడుమిల్లి : ఏజెన్సీలో పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ మధుసూదనరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మారేడుమిల్లిలో పర్యటించిన ఆయన వనవిహారి వద్ద రూ.22 లక్షలతో విహారి కాటేజ్, బేంబో రెస్టారెంట్‌ను ప్రారంభించారు. అనంతరం రంపచోడవరం, చింతూరులో రూ.1.50 కోట్లతో నిర్మించనున్న డీఎఫ్‌వో కార్యాలయ భవనాలకు మారేడుమిల్లి నుంచి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. వన విహారిలో నూతనంగా నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యటకంగా మారేడుమిల్లి అభివృద్ధి చెందుతుందన్నారు. ఇక్కడి ప్రకృతి అందాలను తిలకించేందుకు ఏటా అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివస్తున్నారన్నారు. అందుకు తగ్గట్టుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్జర్వేటర్ శ్రీనివాస రెడ్డి, డీఎఫ్‌వో జీజీ నరేంథిరన్, స్క్వాడ్ డీఎఫ్‌వో త్రిమూర్తులు రెడ్డి, రంపచోడవరం, అడ్డతీగల సబ్ డీఎఫ్‌వోలు శ్రీవాణి, శ్రీ రామారావు, రేంజ్ అధికారులు అజాత్, శ్రీసాయి, కరుణాకర్, అబ్బాయి రెడ్డి, ఉషారాణి పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట



మాదలలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, నేతలు



దబ్బగూడెంలో ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

అరకులోయటౌన్: గిరిజనుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని మాదల పంచాయతీ కేంద్రంలో పల్లెకు పోదాం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామస్తులకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ మాదల పంచాయతీలో రహదారి సౌకర్యం కల్పించామని, హుద్‌హుద్ తుపాను బాధితులకు గృహాలు నిర్మించామన్నారు. పార్టీలకతీతంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, వైస్ ఎంపీపీ రామన్న, సర్పంచ్ రమేష్, నాయకులు శెట్టి అప్పాలు, వెంకటరావు, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన జగనన్నతోనే సాధ్యం

చింతూరు: గతానికి భిన్నంగా రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ పాలన కేవలం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ అన్నారు. మండలంలోని గూడూరులో సోమవారం నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి అవినీతికి తావులేకుండా గ్రామ సచివాలయ, వార్డు వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కొత్తపల్లి, గూడూరు పంచాయతీల్లోని గ్రామాల్లో గడచిన నాలుగేళ్లలో 1,700 మంది లబ్ధిదారులకు రూ 8.60 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. గ్రామాల్లో సచివాలయం, ఆర్‌బీకే, సామాజిక భవనాలు, రహదారులు తదితర అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని వారు కోరారు. తూలుగొండ, దబ్బగూడెం, వేములరాయి, కొత్తపల్లి, దేవరపల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వారు పాల్గొని ప్రభుత్వ పథకాలను వివరించారు. ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీలు అర్జున్, సుధాకర్, కో–ఆప్షన్ సభ్యుడు అక్బర్‌అలీ, మండల కన్వీనర్ రామలింగారెడ్డి, నాయకులు కృష్ణ, విజయ్‌రెడ్డి, రాంప్రసాద్, ఖాదర్‌షరీఫ్, శ్యాంప్రసాద్, సుజాత, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అంబలం పూజ



పూజ నిర్వహిస్తున్న అయ్యప్ప మాలధారులు

సాక్షి,పాడేరు: స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి అయ్యప్ప స్వామి అంబలంపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాడేరుకు చెందిన వరుణ్‌కుమార్ అంబలంపూజను ఏర్పాటు చేశారు. ఈశ్వరరావు గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో అయ్యప్పమాలధారులు పాల్గొని, పూజలు చేశారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు, ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న వీవీఎస్ లక్ష్మణ్



ఆశీర్వచనం అందుకుంటున్న వీవీఎస్ లక్ష్మణ్ దంపతులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని సోమవారం భారత క్రికెట్ జట్టు మాజీ సభ్యుడు వి.వి.ఎస్.లక్ష్మణ్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

26 నుంచి నృసింహ దీక్షలు

సింహాచలం: ఈనెల 26 నుంచి 41 రోజుల శ్రీనృసింహ దీక్షలు, డిసెంబరు 4వ తేదీ నుంచి 32రోజుల శ్రీనృసింహ దీక్షలు ప్రారంభమవుతాయని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ప్రకటించారు. ఈ ఏడాది దేవస్థానం వైదికులు సూచించిన ప్రకారం దీక్షా తేదీలను ఖరారు చేసినట్లు తెలిపారు. పై తేదీల్లో సింహగిరిపై శాస్త్రోక్తంగా మాలధారణ ఉంటుందని, దేవస్థానం తరపు నుంచి స్వామివారి తులసిమాల, ప్రతిమ ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు. వచ్చే ఏడాది జనవరి 6న రెండు దీక్షల విరమణ ఉంటుందన్నారు.

23,27 తేదీల్లో రాత్రి 7 గంటల వరకే అప్పన్న దర్శనాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనాలు ఈనెల 23, 27 తేదీల్లో రాత్రి ఏడు గంటల వరకే లభిస్తాయని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. 23న కార్తీక ఏకాదశిని పురస్కరించుకుని రాత్రి కైశిక పురాణ విన్నపం, తిరువీధి ఉంటాయన్నారు. 27న కార్తీక పౌర్ణమిని సందర్భంగా వృశ్చిక దీపారాధన కార్యక్రమం ఉంటుందన్నారు. ఆయా కార్యక్రమాల టిక్కెట్లు కూడా రద్దు చేసినట్లు తెలిపారు.

మెరుగైన వైద్యం అందించాలి



రంపచోడవరం ఏరియా ఆస్పత్రిని సందర్శించిన డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కృష్ణారావు

రంపచోడవరం: మండల కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కె.కృష్ణారావు సోమవారం సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మి పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. ఆయన వెంట డీటీసీఎం డాక్టర్ వి.విశ్వేశ్వరనాయుడు తదితరులున్నారు.

టీబీ కేంద్రం పరిశీలన

కూనవరం: కూనవరం సీహెచ్‌సీ కేంద్రంలోని టీబీ కేంద్రాన్ని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ విశ్వేశ్వరనాయుడు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ల్యాబ్ లోని రికార్డులను తనిఖీచేశారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. కూనవరం రేఖపల్లి ప్రాంత వైద్యాధికారులు కె.సునీల్‌కుమార్ , ధనలక్ష్మీ, సూర్య తదితరులు పాల్గొన్నారు.

హార్బర్‌లో అలజడి

- చేపల రేవు చరిత్రలో అతి పెద్ద అగ్ని ప్రమాదం
- 'హుద్‌హుద్' తర్వాత మళ్లీ అంతటి భారీ నష్టం
- ప్రమాద తీవ్రతను పెంచిన ఈశాన్య గాలులు
- అర్ధరాత్రి రంగంలోకి దిగిన మత్స్యకార యువకులు
- ఇతర బోట్లు ప్రమాదానికి గురికాకుండా తరలింపు



ఫిషింగ్ హార్బర్‌లో దగ్ధమైన బోట్లు



దగ్ధమైన బోట్లు, సామగ్రి

సాక్షి, విశాఖపట్నం : విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో అగ్ని ప్రమాదం తీవ్ర అలజడిని రేపింది. మునుపెన్నడూ లేనివిధంగా ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ ప్రమాదంతో విశాఖ ఉలిక్కి పడింది. ఐదు దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ చేపలరేవులో అతి పెద్ద అగ్ని ప్రమాదం ఇదే. ప్రమాద సమాచారాన్ని తెలుసుకున్న వెంటనే నగరంలోని మత్స్యకారులు పిల్లా పాపలతో హార్బర్‌కు పరుగులు తీశారు. అలా సోమవారం మధ్యాహ్నం వరకు వీరు చేపలరేవుకు వస్తూనే ఉన్నారు. మంటల్లో కాలిపోయిన బోట్లను చూసి బాధిత కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. తాము రూ.లక్షల్లో అప్పు చేసి బోట్లు కొనుగోలు చేశామని, ఇప్పుడు మంటల్లో కాలిపోయాయంటూ రోదించారు. ఇలా పెద్ద సంఖ్యలో వచ్చిన మత్స్యకారులతో పాటు అధికారులు, మీడియా ప్రతినిధులతో హార్బర్ పరిసరాలన్నీ కిక్కిరిసిపోయాయి. తొమ్మిదేళ్ల క్రితం సంభవించిన హుద్‌హుద్ తుపానుకు 60 బోట్లు మునిగిపోగా మరో 200కి పైగా బోట్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ అగ్ని ప్రమాదంలో 36 బోట్లు పూర్తిగా, తొమ్మిది బోట్లు పాక్షికంగా కాలిపోయాయి. దాదాపు పది బోట్లలో దించకుండా ఉంచిన టన్నుల కొద్దీ చేపలూ దగ్ధమయ్యాయి.

అగ్నికి ఆజ్యం ఇలా..

హార్బర్‌లో అగ్ని ప్రమాదం తీవ్రతరం కావడానికి మరిన్ని ఆజ్యం పోశాయి. లంగరు వేసి ఉన్న అన్ని బోట్లలో వందల నుంచి వేల లీటర్ల డీజిల్ ఉంది. బోట్లను ఫైబర్‌తో తయారు చేస్తారు. బోట్లలో నైలాన్ వలలు ఉంటాయి. అలాగే బోట్లు రాపిడికి గురికాకుండా ఇరుపక్కల పాత టైర్లను అమరుస్తారు. చేపలవేటకు వెళ్లినప్పుడు బోటులో కలాసీలు వంట చేసుకోవడానికి రెండేసి గ్యాస్ సిలిండర్లు తీసుకెళ్తుంటారు. ఇవి బోట్లలోనే ఉంచుతారు. అగ్ని ప్రమాదం తీవ్రత పెంచడానికి ఇవన్నీ దోహదపడ్డాయి. అంతే కాదు.. ప్రమాదం ఇతర బోట్లకు వేగంగా విస్తరించడానికి గాలులు కూడా తోడయ్యాయి. ప్రస్తుతం ఈశాన్య గాలులు బలంగా వీస్తున్నాయి. హార్బర్‌లోని జీరో జెట్టీ ఆరో నంబర్ షాపు ఎదురుగా లంగరేసిన బాలాజీ బోటులో మొదట అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అక్కడ నుంచి నిమిషాల్లోనే పక్కనున్న బోట్లకు మంటలు వ్యాపించాయి. ఈశాన్య గాలుల దాటికి పశ్చిమ, వాయవ్య దిక్కుల్లో లంగరేసిన బోట్లు కొన్ని ఒకటో నంబర్ జెట్టీలో ఉన్న బోట్ల వైపు వెళ్లిపోయాయి. దీంతో అక్కడున్న పలు బోట్లు అగ్నికి ఆహుతయ్యాయి.

యువకుల సాహసం

అగ్ని ప్రమాదం విషయం తెలుసుకున్న కొందరు మత్స్యకార యువకులు పరుగున హార్బర్‌కు చేరుకున్నారు. జెట్టీలకు కట్టిన తాళ్లను కోసివేసి బోట్లకు తాళ్లు కట్టి హార్బర్‌కు దూరంగా తీసుకెళ్లిపోయారు. దీంతో చాలా బోట్లను అగ్ని ప్రమాదం నుంచి కాపాడగలిగారు. లేదంటే మరిన్ని బోట్లు కాలిపోయి ఉండేవి.

ఇన్సూరెన్స్ లేదాయే..

మరోవైపు బోట్లకు ఏళ్ల తరబడి బీమా సదుపాయం లేదు. దీంతో ప్రమాదవశాత్తూ ఈ బోట్లు కాలిపోయినా, మునిగిపోయినా యజమానికి బీమా సొమ్ము రాదు. దాదాపు మూడు దశాబ్దాల క్రితం వరకు వీటికి ఇన్సూరెన్స్‌కు వీలుండేది. అయితే దేశంలో కొంతమంది తప్పుడు క్లెయిమ్‌లకు పాల్పడుతున్నారని తేలడంతో కేంద్రం బోట్లకు బీమా సదుపాయాన్ని ఎత్తివేసింది. అప్పట్నుంచి బోట్లు ఇన్సూరెన్స్‌కు నోచుకోవడం లేదు. బీమా సదుపాయం ఉండి ఉంటే ఈ ప్రమాదంలో కాలిపోయిన బోట్లకు పరిహారం అందేదని మత్స్యకారులు చెబుతున్నారు.



నిరాశతో మత్స్యకారులు, సొమ్మసిల్లిన మహిళ



ప్రమాద స్థలిని పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

రేపటి నుంచి రైల్వే బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు



పోస్టర్ విడుదల చేస్తున్న డీఆర్‌ఎం సౌరబ్‌ప్రసాద్

విశాఖ స్పోర్ట్స్: అఖిల భారత రైల్వే బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఈనెల 22వ తేదీ నుంచి రైల్వే స్టేడియం ప్రాంగణంలో జరగనుంది. ఈస్ట్‌కోస్ట్ రైల్వే, సదరన్ రైల్వే, ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ, సౌత్ సెంట్రల్ రైల్వే, వెస్ట్రన్ రైల్వే, సెంట్రల్ రైల్వేతో పాటు సౌత్ ఈస్ట్రన్ రైల్వే జట్లు పోటీపడనున్నాయి. మూడురోజుల పాటు ఏడు బృందాలు తలపడనున్న ఈ పోటీల పోస్టర్‌ను డీఆర్‌ఎం సౌరబ్‌ప్రసాద్ సోమవారం విడుదల చేశారు.

ఈకోర్‌రైల్వే వాల్తేర్ క్రీడాధికారి ప్రవీణ్ భాటి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహారాణా, బి.అవినాష్, ఎ.అవినాష్ పాల్గొన్నారు.

విశాఖ చేరుకున్న భారత్,ఆస్ట్రేలియా టీ-20 జట్లు



రాడిసన్ బ్లూ హోటల్‌లో జితేష్‌తో రింక్



హోటల్‌కు చేరుకున్న తిలక్

విశాఖ స్పోర్ట్స్ : భారత్–ఆస్ట్రేలియా మధ్య ఈనెల 23 నుంచి టీ–20 మ్యాచ్ జరగనుంది. తొలి మ్యాచ్‌కు విశాఖలోని వైఎస్సార్ ఏసీఏవీడీసీఏ స్టేడియం వేదిక కానుంది. ఇరు జట్లు విశాఖ చేరుకున్నాయి. రాడిసన్ బ్లూ హోటల్‌లో భారత్ ఆటగాళ్లు సేద తీరగా... ఆసీస్ ఆటగాళ్లు సోమవారం వైఎస్సార్ స్టేడియంలో ప్రాక్టీస్ చేశారు. ఆసియన్ గేమ్స్‌లో ఆడిన క్రీడకారులే ఎక్కవ మంది భారత్ తరుపున ఆడనున్నారు.

సింహగిరిపై వచ్చే నెల 23న ముక్కోటి ఏకాదశి

సింహాచలం : సింహగిరిపై డిసెంబర్ 23న ముక్కోటి ఏకాదశి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నామని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఆ రోజు స్వామివారి ఉత్తర ద్వార దర్శనానికి తరలి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ముక్కోటి ఏర్పాట్లపై సోమవారం సాయంత్రం దేవస్థానం వైదికులు, ఇంజినీరింగ్ అధికారులు, సెక్షన్ హెడ్‌లతో ఈవో ముందస్తు సమావేశం నిర్వహించారు. చేయాల్సిన ఏర్పాట్లపై విభాగాల వారీగా చర్చించారు. ఆ రోజు నిర్వహించాల్సిన వైదిక కార్యక్రమాలు, దర్శనాల సమయాలు, పుష్పాలంకరణ, క్యూలైన్లు, సీసీ కెమెరాల ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉచిత ప్రసాదాల వితరణ, వేదిక ఏర్పాటు, అన్నదానం, భక్తుల దర్శనాలు, వీఐపీల దర్శనాలు, విద్యుత్ అలంకరణ, మంచినీటి సరఫరా, రవాణా సదుపాయం, కంట్రోల్ రూమ్ ఏర్పాటు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, వైద్య శిబిరాలు, సెక్యూరిటీ గార్డుల ఏర్పాటుపై అధికారులతో చర్చించారు. అన్నిశాఖల అధికారుల సమన్వయంతో ముక్కోటి ఏకాదశిని విజయవంతం చేస్తామని ఈవో తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో సుజాత, ఎస్‌డీసీ రామలక్ష్మి, స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు పాల్గొన్నారు.

మార్మోగిన శివ నామస్మరణ

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



రంప శివాలయంలో రుద్రహోమం నిర్వహిస్తున్న భక్తులు



అరకులోయలోని భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తులు

సాక్షి,పాడేరు: కార్తీక మాసం తొలి సోమవారం పురస్కరించుకుని జిల్లాలోని శివాలయాల్లో శివ నామస్మరణ మార్మోగింది. ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రమైన మత్స్యగుండం క్షేత్రంలోని మత్స్యలింగేశ్వర స్వామికి వేకువజాము నుంచే భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొర్రాగుహలు, కాశీపట్నం, అరకులోయలోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి, డుంబ్రిగుడలోని కురిడి, హుకుంపేటలోని అడ్డుమండ, గడికించుమండ, ఉక్కుర్బ, సంపంగిపుట్టు, పాడేరులోని ఉమానీలకంఠేశ్వరస్వామి, పాతపాడేరు, లగిశపల్లి, గెడ్డంపుట్టు, వంజంగి, తామరాపల్లిలోని శివాలయాలు, త్రిలింగేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ప్రత్యేక అభిషేకాలు, కార్తీక దీపారాధన నిర్వహించారు.

రంప శివాలయానికి పోటెత్తిన భక్తులు

రంపచోడవరం : కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో మండలంలోని ప్రసిద్ధిగాంచిన రంప శివాలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచి శివాలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. 12వ శతాబ్దంలో వెలసిన ఈ భ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఆలయంలో అర్చకులు శ్రీ గొడవర్తి ప్రసన్న కుమార్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంపచోడవరం సంత మార్కెట్ చివరి కాలువ వద్ద కొలువైన శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో నవగ్రహింసహిత రుద్ర హోమాన్ని ఆలయ అర్చకుడు శ్రీ లింగాల సీతారామాంజనేయ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో వేదపండితులు శ్రీ చింతా పవన్ కుమార్ శర్మ, దొంతికుర్తి వినమ్ శర్మ, శ్రీ సీతక్క రాంప్రసాద్ శర్మ నిర్వహించారు. ఆలయ అవరణలో భక్తులకు భారీ అన్నసమారాధన ఏర్పాటుచేశారు. భక్తులు టేకుమూడి గనిరాజు, ఆలయ కమిటీ చెర్మన్ పింజర్ల నాగవీరభద్రరావు, రంపచోడవరం ధర్మప్రచార సేవా భక్త మండలి కోఆర్డినేటర్ నల్లమిల్లి వెంకట రామారెడ్డి పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



కేజీబీవీ విద్యార్థినుల నృత్యాలు



గంగవరంలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న సర్పంచ్ అక్కమ్మ



కూనవరంలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

డుంబ్రిగుడ/గంగవరం/కూనవరం: గ్రంథాలయ వారోత్సవాలు జిల్లాలో సోమవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పుస్తక పఠనంతో విజ్ఞానం సమకూరుతుందన్నారు. పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సాక్షి, పాడేరు: జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని సమత సంస్థ ఏజెన్సీలోని పలు పాఠశాలల్లో విద్యార్థిని, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను సోమవారం నిర్వహించింది. బొర్రా, అరకులోయ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలతో పాటు పాడేరు ఏపీఆర్ కళాశాలలో పోటీలను నిర్వహించి, విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.అలాగే బాలల హక్కులపై ప్లకార్డులతో ప్రచారం చేశారు. స్వచ్ఛంద సంస్థ కో-ఆర్డినేటర్ కె.సతీష్‌కుమార్, యూత్ విభాగం ప్రతినిధి సౌజన్య, ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.



పాడేరులో విద్యార్థుల మానవహారం

ఘనంగా కుంతీదేవి ఉత్సవాలు



నందీశ్వరుడి ఊరేగింపు

- మూడేళ్లకోసారి వేడుక
- రేఖపల్లిలో సందడి

వీఆర్‌పురం : మండలంలోని రేఖపల్లి ఎస్సీ కాలనీలో మూడేళ్ల కొకసారి నిర్వహించే కుంతీదేవి ఉత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. గత నెల 22న ప్రారంభమైన ఈ ఉత్సవాల సందడి నెలకొంది. వీఆర్‌పురం, ధర్మతాళ్లగూడెం మీదుగా అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్లి శబరి నదిలో నిమజ్జనం చేశారు. అనంతరం రాత్రి నందీశ్వరుడిని రేఖపల్లి, రాజుపేట గ్రామాల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మట్టితో రూపొందించిన విగ్రహానికి సోమవారం రాత్రి (మంగళవారం తెల్లవారుజాము) నిర్వహిస్తామని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాచర్ల గంగులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు. ఇలావుండా వేలంపాటలో మట్టి విగ్రహాన్ని సంబంధిత వ్యక్తి పొలంలో ఉంచితే పంటలు బాగా పండుతాయని గ్రామస్తుల విశ్వాసం. అందుకు తగ్గట్టుగా విగ్రహాన్ని పొందేందుకు వేలం పాటలో పోటీపడతారు.

నేటి నుంచి ఫుట్‌బాల్ పోటీలు

భీమునిపట్నం: భీమిలిలోని వుడా మైదానంలో మంగళవారం నుంచి రాష్ట్ర స్థాయి అండర్ – 14 అంతర జిల్లా బాల, బాలికల ఫుట్‌బాల్ పోటీలు పారంభమవుతాయని విశాఖ జిల్లా స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. ఇందులో 13 జిల్లాల నుంచి 468 మంది బాల, బాలికలు, 50 మంది కోచ్‌లు, 40 మంది మేనేజర్లు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ పోటీలు భీమిలి, చిట్టివలస, అమేయా ఇంటర్నేషన్ స్కూల్ వద్ద జరుగుతాయన్నారు.